క్లుప్తంగా

విద్యుత్ గ్రీవెన్స్‌కు 4 సమస్యలు



వినియోగదారుల నుంచి సమస్యలను తెలుసుకుంటున్న ట్రాన్స్‌కో డీఈ ఆనంద్

చిత్తూరు కార్పొరేషన్: స్థానిక గాంధీరోడ్డులోని ట్రాన్స్‌కో ఈఈ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విద్యుత్ గ్రీవెన్స్ కార్యక్రమంలో మొత్తం 4 సమస్యలపై వినతులు అందాయని డీఈ ఆనంద్ తెలిపారు. బంగారుపాళ్యం మండలంలో వ్యవసాయ సర్వీసులను గృహ సర్వీసుకు అనుసంధానం చేయాలని రెండు ఫిర్యాదులు, చిత్తూరు రూరల్స్, కొత్తపల్లెలో రివిజన్ ఆఫ్ బిల్లుపై ఫిర్యాదు అందిందన్నారు. గృహ సర్వీసుకు బిల్లును అనుసంధానం చేయించామన్నారు. రివిజన్ ఆఫ్ బిల్లును సరి చేశామని తెలిపారు. కార్యక్రమంలో టెక్నికల్ ఏఈ మాధురి, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు తవణంపల్లెలో వనమహోత్సవం

తవణంపల్లె: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం వనమహోత్సవం కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ హరిప్రసాద్ రెడ్డి, ఏపీఓ బాల తెలిపారు. మండలంలో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన నీటికుంటల పనుల వద్ద మొక్కలు నాటుతామన్నారు. అలాగే, ఉపాధి హామీ పథకం కింద ఆసక్తి కలిగిన రైతులు గట్టులో టేకు, మహాఘని, ఎర్రచందనం వంటి మొక్కలు నాటుకోవచ్చని, ఈ మొక్కల సంరక్షణకు మూడేళ్ల పాటు బిల్లులు మంజూరు చేస్తామన్నారు. రైతులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ట్రస్టులకు విరాళం



విరాళమిస్తున్న రామకృష్ణనాయుడు

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానానికి బుధవారం చిత్తూరు మండలం వెంగనపల్లెకు చెందిన రామకృష్ణ నాయుడు అన్నదాన ట్రస్టుకు రూ. 2లక్షలు, గోసంరక్షణ ట్రస్టుకు రూ. లక్ష చొప్పున విరాళం ఇచ్చారు. అనంతరం ఆలయ అధికారులు దాతకు దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించండి



అరగొండలో రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ మోహన్‌వేలు

తవణంపల్లె: ప్రజలు తమ ఆరోగ్యం విషయంలో శ్రద్ధ వహించాలని తవణంపల్లె వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక అన్నారు. బుధవారం మండలంలోని దిగువమాఘంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. పలువురికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. అలాగే అరగొండలో డాక్టర్ మోహన్‌వేలు ఫ్యామిలీ డాక్టర్ నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

భవనాల వ్యర్థాలు రోడ్డుపక్కన పడేస్తే జరిమానా

చిత్తూరు అర్బన్: భవనాల వ్యర్థాలను రోడ్ల పక్కన పడేస్తే జరిమానా తప్పదని చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ నరసింహ ప్రసాద్ హెచ్చరించారు. ఇరువారం వద్ద రోడ్డు పక్కన భవన వ్యర్థాలు పడేసిన ట్రాక్టర్‌ను బుధవారం సీజ్ చేసి కార్పొరేషన్ కార్యాలయానికి తరలించారు. ఆపై డ్రైవర్‌కు జరిమానా విధించారు. భవన వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ డంప్ చేయడానికి వీల్లేదన్నారు. వ్యర్థాలు ఎక్కడైనా వేయాలంటే కార్పొరేషన్ అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు.

డీసీసీబీ చైర్మన్ ప్రమాణ స్వీకారం



చైర్మన్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యేలు

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరులో డీసీసీబీ చైర్మన్‌గా అమాస రాజశేఖర్‌రెడ్డి బుధవారం అధికారులు, ఎమ్మెల్యేల సమక్షంలో ప్రమాణస్వీకారం చేశారు.. అనంతరం పలువురు ఆయనను అభినందించారు. రైతులకు విరివిగా రుణాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో బ్యాంకు సీఈఓ శంకర్ బాబు, ఎమ్మెల్యేలు గురజాల జగన్‌మోహన్, మురళీ మోహన్, గాలి భాను ప్రకాష్, పులివర్తినాని, కూటమి నేతలు పాల్గొన్నారు.

ప్రజలకు బాబు వెన్నుపోటు



వెన్నుపోటు దినం కార్యక్రమంలో కలెక్టరేట్‌కు ర్యాలీగా వస్తున్న విజయానందరెడ్డి, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు



బంగారుపాళెం: తహసీల్దార్ కార్యాలయానికి ర్యాలీగా వెళ్తున్న కార్యకర్తలు

- హామీలతో దగా చేసిన ప్రభుత్వం
- 'వెన్నుపోటు దినం' నిరసన ర్యాలీతో దద్దరిల్లిన కలెక్టరేట్, బంగారుపాళెం
- వేలాదిగా తరలివచ్చిన ప్రజలు, నాయకులు, కార్యకర్తలు
- కూటమి ఏడాది పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత
- హామీలతో ప్రజలను చంద్రబాబు దగా చేశారని చిత్తూరు, పూతలపట్టు సమన్వయకర్తల విమర్శ





వెన్నుపోటు దినం ర్యాలీగా వస్తున్న విజయానందరెడ్డి, పరిశీలకులు రాజశేఖర్‌రెడ్డి నాయకులు, తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న సునీల్‌కుమార్



కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీకి వినతిపత్రం ఇస్తున్న విజయానందరెడ్డి, నాయకులు, కార్యకర్తలు

చిత్తూరు కలెక్టరేట్/చిత్తూరు కార్పొరేషన్/బంగారుపాళెం: సూపర్ సిక్స్ హామీలతో అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా కూటమి ప్రభుత్వం హామీలు నెరవేర్చకుండా ప్రజలను వెన్నుపోటు పొడిచిందని చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి, పూతలపట్టు మాజీ ఎమ్మెల్యే, సమన్వయకర్త డాక్టర్ సునీల్ విమర్శించారు. వైఎస్సార్ సీపీ అధిష్టానం ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం చిత్తూరు, పూతలపట్టు నియోజకవర్గం బంగారుపాళెంలో 'వెన్నుపోటు దినం' ర్యాలీలతో హోరెత్తించారు. చిత్తూరులో అమూల్ డెయిరీ నుంచి కలెక్టరేట్ వరకు, బంగారుపాళెంలో అంబేడ్కర్ విగ్రహం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించి అధికారులకు వినతి పత్రాలు ఇచ్చారు. ఆయా నియోజకవర్గాల మండలాల నుంచి పెద్ద సంఖ్యలో నాయకులు, అభిమానులు, కార్యకర్తలు, పార్టీ అనుబంధ విభాగాల నేతలు హాజరై కదం తొక్కారు. దారి పొడవునా ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో దద్దరిల్లాయి. పార్టీ సమన్వయకర్తలు మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు ఎన్నికలకు ముందు ప్రజలకు మాయ మాటలు చెప్పి, గెలిచాక పథకాలు అమలు చేయకుండా సంక్షేమాన్ని గాలికి వదిలేశారని మండిపడ్డారు. మహిళలను, రైతులను, యువతను, విద్యార్థులతో పాటు అన్ని వర్గాల ప్రజలకు వెన్నుపోటు పొడిచారన్నారు. కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలపై అక్రమ కేసులు బనాయిస్తూ జైళ్లకు పంపడమే పనిగా పెట్టుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యాశాఖ మంత్రిగా ఉన్న లోకేష్ విద్యావ్యవస్థను మరింత భ్రష్టు పట్టించి, 'రెడ్‌బుక్' అరాచకం సృష్టిస్తున్నాడని విమర్శించారు. చంద్రబాబు స్వంత జిల్లా చిత్తూరులో మామిడి రైతులకు గిట్టుబాటు కల్పించడంలో విఫలమయ్యారన్నారు. రైతులకు పంట సాగుకు పెట్టిన ఖర్చులు సైతం అందక అవస్థలు పడుతున్నా పట్టించుకోలేదన్నారు. మామిడి బోర్డు ఏర్పాటు చేసి టన్నుకు 20 వేలు గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. చిత్తూరు నిరసన ర్యాలీలో పార్లమెంట్ పరిశీలకులు రాజశేఖర్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్, నగర పార్టీ అధ్యక్షుడు కేపీ శ్రీధర్, మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు గాయత్రీదేవి, లీనారెడ్డి, మొదలియార్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జ్ఞానజగదీష్, మున్సిపల్ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హరిణిరెడ్డి, పెన్షనర్ల విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజయసింహారెడ్డి, గుడిపాల మండల కన్వీనర్ ప్రకాష్, చిత్తూరు రూరల్ పార్టీ అధ్యక్షుడు జయపాల్, జెడ్పీటీసీ బాబునాయుడు, ఎంపీటీసీ ప్రతిమారెడ్డి, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ సరళామేరి, నాయకులు, ప్రజాప్రతినిధులు సూర్యప్రతాప్‌రెడ్డి, రజనీకాంత్, భాగ్యలక్ష్మి, నారాయణ, అప్పాజీ, లక్ష్మణస్వామి, సంపత్, శేఖర్, అన్బు, నౌషద్, రాంగణేష్, సయ్యద్, మధురెడ్డి. మధుసూదన్, మనోజ్‌రెడ్డి, పూంగొడి, జనార్ధన్ సర్పంచులు, ఎంపీటీసీలు, కార్పొరేటర్లు, బంగారుపాళెం నిరసనలో జెడ్పీ మాజీ చైర్మన్ కుమార్‌రాజా, మాజీ ఎమ్మెల్యే లలితకుమారి, బంగారుపాళెం, యాదమరి, తవణంపల్లె, ఐరాల, పూతలపట్టు వైఎస్సార్ సీపీ కన్వీనర్లు రామచంద్రారెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ ధనుంజయరెడ్డి, హరిరెడ్డి, బుజ్జిరెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, రాజారత్నంరెడ్డి, జయచంద్రారెడ్డి, గౌహతిసుబ్బారెడ్డి, ఎంపీపీ అమరావతి, వైస్ ఎంపీపీ శిరీష్‌రెడ్డి, రాష్ట్ర మైనారిటీ సెల్ జాయింట్ కార్యదర్శి సర్దార్, జిల్లా పార్టీ నాయకులు గోవిందరాజులు, ప్రకాష్‌రెడ్డి, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు కిషోర్‌రెడ్డి, మండల యూత్ అధ్యక్షుడు గజేంద్ర, ఎస్సీసెల్ అధ్యక్షుడు నాగరాజ, అన్ని మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



బంగారుపాళెంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులను అడ్డుకుంటున్న పోలీసులు

నిరసన ప్రదర్శనకు పోలీసుల అడ్డంకులు

బంగారుపాళెంలో అంబేడ్కర్ విగ్రహం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లాలనుకున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను పోలీసులు అడ్డుకున్నారు. ర్యాలీకి అనుమతి లేదని, వాహనాల్లోనే వెళ్లాలంటూ అడ్డుపడ్డారు. సునీల్‌కుమార్‌తో పాటు ముఖ్య నాయకులను బలవంతంగా వాహనాల్లో ఎక్కించారు. పోలీసులు వాహనాల వెంట నడిచారు. చిత్తూరులో కూడా పోలీసుల ప్రతిబంధకాల నడుమ ర్యాలీ సాగింది.

నిరుద్యోగభృతి ఎక్కడ?



అధికారంలోకి వస్తే నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతి ఇస్తామన్న హామీని ఇప్పటివరకూ నెరవేర్చలేదు. గతంలోను నిరుద్యోగభృతి ఇస్తామని చెప్పి మోసం చేశారు. ఈసారైనా ఇస్తారని చూస్తే వాటిపై ప్రకటనే ఇంతవరకు లేదు. –ప్రవీణ్, కట్టమంచి చిత్తూరు

'తల్లికి వందనం' ఎక్కడ?



అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలకు పెద్ద పీట వేస్తామని, బడికి వెళ్లే ప్రతి విద్యార్థి తల్లి ఖాతాలో రూ.15వేల వేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చి మాట తప్పారు. అధికారంలోకి వచ్చి సంవత్సరం కాలమవుతున్నా తల్లికి వందనం అమలు చేయలేదు.
–దేవి, కట్టమంచి చిత్తూరు

మహిళలను దగా చేశారు



ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను ఇప్పటికీ నెరవేర్చకపోవడంపై నిరసనగా వెన్నుపోటు దినం నిర్వహించాం. మహిళలకు తల్లికి వందనం, ఉచిత సిలిండర్, రైతుకు సాయం, ఉచిత బస్సు హామీలు గాలిలో దీపమయ్యాయి. పింఛన్లకు కోత పెట్టి మోసం చేశారు. కొత్త పింఛన్లు ఇవ్వడం లేదు. –గాయత్రీదేవి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మహిళా విభాగం, వైఎస్సార్‌సీపీ

కూటమి పాలనపై ప్రజల్లో వ్యతిరేకత



అధికారంలోకి వచ్చి ఏడాదైనా పథకాల అమలు ఊసే లేదు. ఇచ్చిన హామీలతో వెన్నుపోటు పొడిచారు. తల్లికి వందనం, ఆడబిడ్డల నిధి, ఉచిత బస్సు ప్రయాణం, పెట్టుబడి సాయం..ఇలా ఏ ఒక్కటీ నెరవేర్చకుండా ఎగనామం పెట్టడంతో ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. –లీనారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మహిళా విభాగం వైఎస్సార్‌సీపీ

హామీలు నెరవేర్చాలి



ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చాలి. 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.1500 చొప్పున బ్యాంకు ఖాతాకు జమచేస్తానని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఈ పథకం అమలు కోసం ఏడాది కాలంగా ఎదురుచూస్తున్నాం. ఎప్పుడు ఇస్తారో కూడా చెప్పడం లేదు.
–కవిత, సాంబయ్యకండ్రిగ, చిత్తూరు

ఒక సిలిండరేనా?



ఏడాదికి మూడు సిలిండర్లు ఇస్తామని మేనిఫెస్టోలో పెట్టారు. ఏడాది అయింది నామమాత్రంగా హామీని నెరవేర్చారు. ప్రస్తుతానికి ఒక సిలిండర్ డబ్బులు మాత్రమే వేశారు. లబ్ధిదారుల సంఖ్యను కూడా తగ్గించేస్తున్నారు. ఇలాగైతే ఎలా; సిలిండర్ కోసం మహిళలు ఎదురుచూస్తున్నారు.
–లక్ష్మి, చిత్తూరు

చంద్రబాబుది డైవర్షన్ పాలిటిక్స్



హామీలను నెర్చకుండా సీఎం చంద్రబాబునాయుడు డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నారు. ప్రశ్నించే గొంతుకలను 'రెడ్‌బుక్' అరాచకంతో నొక్కేస్తున్నారు, కేసులు బనాయిస్తున్నారు. ఇలాంటి నీచ రాజకీయం ఎప్పుడూ చూడలేదు. కూటమి పాలనలో అభివృద్ధి, సంక్షేమం రెండూ లేవు. –హరిణిరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మున్సిపల్ విభాగం వైఎస్సార్‌సీపీ

ఉద్యోగాలు ఇవ్వడం లేదు



పరిశ్రమలు స్థాపించి స్థానిక యువతకు ఉద్యోగాలు ఇస్తామన్నారు. ఇంతవరకు ఒక పరిశ్రమకు భూమి పూజ చేయలేదు. జాబ్ క్యాలెండర్లను ప్రకటించి ఉద్యోగాలను భర్తీ చేస్తామని ప్రకటించారు. అది ఎప్పుడు అమలవుతుందో తెలియడం లేదు. ఉద్యోగాల కోసం ఇతర పొరుగు రాష్ట్రాలకు వెళ్లాల్సి వస్తోంది.
–రుత్విక్‌రెడ్డి, రెడ్డి అండ్ రెడ్డి కాలనీ, చిత్తూరు

సూపర్ దగా



కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాదైనా ఆడబిడ్డ నిధి పథకం ఊసే ఎత్తడం లేదు. సూపర్‌సిక్స్ అంటూ వచ్చి ప్రజల్ని సూపర్‌గా దగా చేస్తున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో సీఎం జగన్‌మోహన్ రెడ్డి పేదలందరినీ ఆదుకున్నారు. కూటమి ప్రభుత్వం వంచన తప్ప చేసిందేమీ లేదు.
–ప్రియ, ఎస్టేట్ చిత్తూరు

ఒక్క రూపాయి ఇవ్వలేదు



అధికారంలో వచ్చాక కూటమి ప్రభుత్వం పథకాల రూపేణా ప్రజలకు ఒక్క రూపాయి కూడా ఇచ్చిన పాపానపోలేదు. పింఛన్లకు కోత పెట్టారు. వలంటీర్లు, రేషన్ బండ్ల నిర్వాహకుల కడుపు కొట్టారు. పెట్టుబడి సాయం ఇవ్వక రైతుల ఉసురు పోసుకుంటున్నారు. హామీలన్నీ అటకెక్కించారు. జాబ్ క్యాలెండర్ ఊసే లేదు.
–చంద్రశేఖర్, డిప్యూటీ మేయర్

వేరుశనగ విత్తనాల కోసం రిజిస్ట్రేషన్

బంగారుపాళెం: మండలంలోని రైతులు గురువారం నుంచి వేరుశనగ విత్తనాల కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవాలని వ్యవసాయాధికారి చిట్టిబాబు కోరారు. మండలానికి 1270 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలు వచ్చాయని, ఇవి అవసరమైన రైతులు ఆయా రైతు సేవా కేంద్రాలలో రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని తెలిపారు. 30 కేజీల బస్తా ధర రూ.2790 అని, ప్రభుత్వ రాయితీ 1116 రూపాయలు పోను రైతులు 1674 రూపాయలు చెల్లించి తీసుకోవాలన్నారు. రైతులు బయోమెట్రిక్ ద్వారా ఈ విత్తనాలు పొందడానికి ఆధార్, పట్టాదారు పాసుపుస్తకం, మొబైల్‌ఫోన్ తీసుకువెళ్లి నమోదు చేసుకోవాలన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో వేరుశనగ విత్తనాల పంపిణీ అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రారంభించారు.



బంగారుపాళెంలో రైతులకు వేరుశనగ విత్తనాలు పంపిణీ ప్రారంభిస్తున్న అధికారులు

విద్యాబోధనలో నిబద్ధత ముఖ్యం



మాట్లాడుతున్న మాస్టర్ ట్రైనీ కోమల

చిత్తూరు కలెక్టరేట్: టీచర్ల విద్యాబోధనలో నిబద్ధత పాటించాలని ఉమ్మడి పరీక్షల విభాగం సెక్రటరీ హేమాద్రి అన్నారు. నగరంలోని గిరింపేట మున్సిపల్ హైస్కూల్ లో స్కూల్ అసిస్టెంట్లు, హెచ్ఎంలకు రెండవ రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఉపాధ్యాయుడు తమ వృత్తి ధర్మం పాటిస్తూ విద్యార్థుల సామర్థ్యాలను పెంపునకు, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. అనంతరం మాస్టర్ ట్రైనీ హెచ్ఎం కోమల శిక్షణ తరగతుల్లో పలు అంశాలను వివరించారు. శిక్షణలో పలు ప్రాంతాల టీచర్లు పాల్గొన్నారు.

చిత్తూరు కార్పొరేషన్‌లో లంచావతారులు

- కలెక్టర్‌కు వైఎస్సార్ సీపీ సమన్వయకర్త ఫిర్యాదు

చిత్తూరు అర్బన్: చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో పెరిగిపోతున్న అవినీతి, అక్రమాలను అరికట్టాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త విజయానందరెడ్డి కోరారు. బుధవారం వెన్నుపోటు దినం నేపథ్యంలో కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందచేశారు. అనంతరం కార్పొరేషన్ కార్యాలయంలో అవినీతి అక్రమాలు విచ్చలవిడిగా సాగుతోందన్నారు. ప్రధానంగా నగరంలో చిన్నపాటి ఇళ్లు నిర్మించుకోవాలన్నా, సామాన్యులు రూ.లక్షల్లో లంచాలు డిమాండ్ చేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయన్నారు. టౌన్ ప్లానింగ్ విభాగంలో అవినీతి అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని కలెక్టర్‌ను కోరారు. దీనిపై నిఘా ఉంచి, ఆరోపణలు నిజమని తేలితే చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు.

మరుదు బ్రదర్స్ విగ్రహావిష్కరణకు రండి సార్!

చిత్తూరు కలెక్టరేట్: జిల్లా కేంద్రంలో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో మరుదు బ్రదర్స్ విగ్రహాలను నిర్మించారు. నగరంలోని గంగినేనిచెరువు వద్ద వీటిని త్వరలో ఆవిష్కరించనున్నారు. ఈ కార్యక్రమానికి హాజరు కావాలని బుధవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీని రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బుల్లెట్ సురేష్ కోరారు. అలాగే, ఆహ్వాన పత్రిక అందజేశారు. కార్యక్రమంలో బుల్లెట్ అప్పు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

చిత్తూరు అర్బన్: ప్రజలు సీజనల్ వ్యాధులు, విష జ్వరాల బారిన పడకుండా ఉండేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ ప్రజారోగ్యశాఖ అధికారి డాక్టర్ లోకేష్ అన్నారు. మలేరియా మాసోత్సవాల్లో భాగంగా బుధవారం మునిసిపల్ కార్యాలయంలో క్రిమి కీటకాల వల్ల కలిగే వ్యాధుల నియంత్రణపై అధికారులకు అవగాహన కల్పించారు. వర్షాలు రానున్న నేపథ్యంలో ఇంజినీరింగ్, ప్రజారోగ్యశాఖ విభాగాలు సంయుక్తంగా పనిచేయాలన్నారు. అనంతరం దోమల నిర్మూలన పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి రామకృష్ణ, డీఈ శ్రావణి, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ జాతర

పెద్దపంజాణి: మండలంలోని సొన్నేపల్లెలో ముత్యాలమ్మ జాతరను బుధవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలోని అమ్మవారి మూలవిరాట్‌కు విశేష అభిషేకాలు, పూజలు చేసి విశేషంగా అలంకరించారు. గ్రామంలో అమ్మవారి ఊరేగింపు సందర్భంగా ప్రతి ఇంటా కర్పూర హారతులిచ్చి కొబ్బరి కాయలు కొట్టారు. గ్రామ దేవతలకు పిండి దీపాలు పెట్టి మొక్కులు చెల్లించారు.



కోలాహలం.. నిమజ్జనం

బంగారుపాళెం: మండలంలోని తగ్గువారిపల్లెలో బుధవారం గంగమ్మ నిమజ్జన కార్యక్రమాన్ని కోలాహలంగా నిర్వహించారు. మంగళవారం ఉదయం అంబలి, సాయంత్రం పొంగళ్లను నైవేద్యంగా సమర్పించారు. రాత్రి అమ్మవారి శిరస్సును విశేషంగా అలంకరించి గ్రామ వీధుల్లో ఊరేగించారు. బుధవారం తెల్లవారుజామున దండుమారెమ్మ ఆలయం పక్కన ఏర్పాటు చేసిన మండపంలో గంగమ్మను కొలువుదీర్చారు. అనంతరం పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పూజలు చేసి మొక్కులు చెల్లించారు. రాత్రి అమ్మవారిని బాణసంచా వేడుకల నడుమ జలప్రవేశానికి తరలించారు. కార్యక్రమంలో జాతర కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



తగ్గువారిపల్లె దండుమారెమ్మ ఆలయం వద్ద కొలువుదీరిన గంగమ్మ